మెరుగైన సేవలకు కృషి చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువయ్యేలా చూడాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ఆయన పాల్గొన్నారు. రుద్రంగి, మల్యాల, నిజామాబాద్ గ్రామాల్లో అవకాశం మేరకు నూతన బ్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు. మూడు మాసాల్లో యువతకు స్వయం ఉపాధి రంగాల్లో లబ్ధి చేకూరేలా సుమారు 1,000 మందికి రుణాలు అందజేయాలని సూచించారు. మెరుగైన సేవలతో మైక్రోఫైనాన్స్ కంపెనీలు, లోన్‌యాప్ నుంచి రుణాలను ప్రజలు తీసుకోవాల్సిన పరిస్థితి రాకుండా ఉంటుందన్నారు. లక్ష్యం మేరకు మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మెప్మా తరఫున వ్యాపార యూనిట్లు ఏర్పాటుకు వచ్చే ప్రతిపాదనలు పరిశీలించి రుణాలు త్వరగా అందేలా చూడాలన్నారు. చిన్న వ్యాపారాలు నడిపే వృత్తుల వారికి పీఎం స్వనిధి రుణాలు అందజేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ఖాతాలను పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై పథకాలు వర్తింపజేయాలన్నారు. పంట రుణాల లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. రుణమాఫీ పెండింగ్, రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. బ్యాంకర్ల సమన్వయంతో పనిచేసి ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు త్వరగా గ్రౌండ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, ఆర్బీఐ ఎల్‌డీవో సాయితేజరెడ్డి, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, యూబీఐ డీజీఎం అపర్ణరెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చిత్రంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఇతర అధికారులు

అధ్యయనంతో.. ఉత్తమ గ్రేడ్లు



పది విద్యార్థులకు విషయ నిపుణుల సూచనలు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

పాఠశాల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు అత్యంత కీలకం. ఇప్పటి నుంచే ఉత్తమ గ్రేడ్లు సాధించేందుకు ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఆశించిన ఫలితాల కోసం సాధన చేస్తున్నా.. వారిలో ఎక్కడో ఒకింత పాఠ్యాంశాలు, సన్నద్ధతపై ఆందోళన, సందేహాలు ఉన్నాయి. గణితం, సామాన్యశాస్త్రంతోపాటు భాషా అంశాలు, సాంఘిక శాస్త్రం ప్రణాళికతో చదివితే విద్యార్థులు ఉత్తమ గ్రేడ్లు సాధించవచ్చు. పదో తరగతిలో భాషా అంశాల్లో ఉత్తమ గ్రేడ్ల సాధనకు సన్నద్ధత, ప్రణాళికపై విషయ నిపుణుల సూచనలతో 'న్యూస్‌టుడే' కథనం.


పెద్దపల్లి జిల్లా పోతారం జడ్పీ ఉన్నత పాఠశాలలో సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

నిత్యాభ్యసనంతో తెలుగు సులువు


గాజుల రవీందర్, పాఠ్యపుస్తక రచయిత, కరీంనగర్

నిత్య అభ్యసనం ద్వారా తెలుగులో ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. 12 పాఠాలు, ఉపవాచకంలోని ఆరు ఖండాలు విభజించుకుని ఏ రోజు ఏం చదవాలో నిర్ణయించుకోవాలి. కష్టమైన అంశాలను గుర్తించి వాటిపై దృష్టి పెట్టాలి. ● అన్ని పాఠాల కవి పరిచయాలను క్షుణ్నంగా అర్థం చేసుకుని చదవాలి. తరచూ వాటిని చూడకుండా రాస్తూ తప్పు ఒప్పులను గుర్తించాలి. ● పరిచిత పద్యం కోసం ముఖ్యమైన 17 పద్యాలను జ్ఞాపకం ఉంచుకోవాలి. ● స్వీయరచన ప్రశ్నలకు అనుగుణంగా జవాబు రాసేలా సాధన చేస్తూ ఉండాలి. దానశీలం, వీర తెలంగాణ, కొత్త బాట, భాగ్యోదయం, శతక మధురిమ, గోల్కొండ పట్టణం, భిక్ష, భూమిక పాఠాలపై ప్రత్యేక దృష్టి నిలపాలి. ● అవగాహన, ప్రతిస్పందనకు సంబంధించిన పరిచిత అపరిచిత గద్యాంశాలకు సంబంధించిన పేరాలను ఒకటికి రెండు సార్లు చదివి వాటిల్లో చెప్పిన అంశం ఏమిటి? దేనికి సంబంధించింది? ఎందుకోసం ఉద్దేశించింది అనే ప్రశ్నలు విద్యార్థులు వేసుకుని పూర్తిస్థాయిలో వాటిపై అవగాహన పెంచుకోవాలి. ● పాఠ్యాంశాల్లోని బాక్స్ ప్రశ్నలు, అభ్యాసాలలోని ప్రశ్నలు, వాటి స్వభావంపై పూర్తి స్థాయి అవగాహన ఉండాలి. ● పరీక్షల్లో జవాబులను క్రమపద్ధతిలో వాక్య నిర్మాణ క్రమాన్ని పాటిస్తూ అక్షర దోషాలు లేకుండా రాసేలా తరచూ సాధన చేయాలి. ● సృజనాత్మక ప్రశ్నల్లో లేఖ, సంభాషణ, కరపత్రం, కవిత, గేయం, ఆహ్వాన పత్రిక, ఆత్మకథ, నినాదాలు, సూక్తులు, అభినందన వ్యాసం, అభినందన పత్రం, ఇంటర్వ్యూ ప్రశ్నలు, వ్యాసం వంటి ప్రక్రియలపై అవగాహన ఉండాలి. ● పాఠాల చివరన వ్యాకరణాంశాలతోపాటు పుస్తకం చివరలోని పద పట్టిక నిఘంటువును తరచూ చదవాలి. ● అక్షర, అన్వయ దోషాలు లేకుండా.. వాక్య నిర్మాణం సరిగ్గా ఉండేలా పరీక్షల్లో జవాబులు రాయాలి.

హిందీ నమూనా ప్రశ్నపత్రాల సాధన ముఖ్యం


షరీఫ్ అహ్మద్, హిందీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్, కరీంనగర్

● పాఠాల్లోని భావాలు పూర్తిగా అర్థం చేసుకొని సమాధానాలు రాయడం అలవాటు చేసుకోవాలి. నమూనా ప్రశ్నపత్రాలను తరచూ సాధన చేయాలి. ● ఆధునిక గద్యాంశం సంబంధించి పాఠ్య పుస్తకం లోనిది కాకుండా హిందీ కథలు, వ్యాసాలు చదవాలి. ● పద్య భాగంలో వాడిన పదాలు, శైలి, అభివ్యక్తి గుర్తింపుపై సాధన చేయాలి. కవి గురించి తెలుసుకోవాలి. ● అర్థ గ్రాహ్యత- ప్రతిక్రియలో అక్షర దోషాలు లేకుండా క్రమ తప్పకుండా శాస్త్రీయ సమాధానాలు రాయాలి. ఒకటి రెండు వాక్యాల్లో సమాధానం రాయాలి. ● వర్తనీ దోషాలు లేకుండా నిత్యం కొన్ని పదాలను రాయడం అలవాటు చేసుకోవాలి. అల్పప్రాణ్, మహాప్రాణ్ ధ్వనులు, ఎక్కువగా ఉచ్చరించే అక్షరాల మధ్య తేడాలు తెలుసుకోవాలి.


బి.సురేంద్ర మోహన్, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, జడ్పీ ఉన్నత పాఠశాల, నాగులమల్యాల

విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్లం పాఠ్యాంశాలని ప్రణాళికతో చదివితే ఉత్తమ జీపీఏ సాధించడం సులభం. పరీక్షలో ఎక్కువగా డిస్కోర్సెస్, క్లోజ్ టెస్ట్, గ్రామర్, అన్‌సీన్ పోయమ్స్ అడుగుతారు. వీటిని విద్యార్థులు పాఠాలను చదివేటప్పుడే ఒక్కో భాగానికి ఒక్కో సారి చదివేలా ప్రణాళిక వేసుకోవాలి. ● ప్రశ్నపత్రంలోని 1-8 వరకు ఉన్న ప్రశ్నల్లో 1-4 రీడింగ్ ఏ నుంచి, 5-8 రీడింగ్ బీ, సీ నుంచి అడుగుతారు. ఇందుకోసం పుస్తకంలోని అన్ని పాఠాలను క్షుణ్నంగా అర్థం చేసుకోవాలి. ప్రశ్నలకు సమాధానాలు సూటిగా, అర్థవంతంగా రాయాలి. ఇందుకు మాదిరి ప్రశ్నలపై అవగాహన పెంచుకోవాలి. ఒక పేరాలో కొన్ని ప్రశ్నలను తరగతి ఉపాధ్యాయుడి ద్వారా తయారు చేయించుకుని ఒక్కో ప్రశ్నకు రెండు మూడు జవాబులు రాసి ఉపాధ్యాయులతో సరిచేయించుకునే పద్ధతిని ప్రాక్టీస్ చేయాలి.

ప్రణాళికతో ఆంగ్లంలో మంచి ఫలితాలు

● 9-12 వరకు గల ప్రశ్నల్లో బార్ (గ్రాఫిక్స్) పై చార్ట్, (గ్రాఫిక్) టేబుల్ వంటి వాటి నుంచి అడుగుతారు. కొన్నిసార్లు ఇచ్చిన టేబుల్ లేదా గ్రాఫ్ గురించి అడుగుతారు కాబట్టి జవాబులు ఆ ప్రశ్నల్లోనే ఉంటాయని గుర్తుంచుకోవాలి. ప్రశ్నలు హేతుబద్ధంగా ఉంటాయి కాబట్టి ఆలోచించి జవాబు రాసేలా సన్నద్ధం కావాలి. ● పేరాగ్రాఫ్ ఆధారంగా జవాబులు రాయడంలో వ్యాకరణ అంశాలు ఉంటాయి. గత ప్రశ్నపత్రాలు చూస్తే వాయిస్, స్పీచ్, క్వశ్చన్ ట్యాగ్స్‌పై ప్రతి సారి ప్రశ్నలు వస్తున్నాయి. వాటిల్లో చాలా రకాలు ఉంటాయి కాబట్టి ఒక్కో రకాన్ని ఒక్కో రోజు ప్రాక్టీస్ చేస్తూ ఉండాలి. ● డిస్కోర్సెస్ ప్రశ్నలను విద్యార్థులు ఎంత బాగా రాయగలిగితే అన్ని మార్కులు వస్తాయి. ఇందుకోసం వాటిపై ఇప్పటి నుంచే రాయడం అలవాటు చేసుకోవాలి. రాత నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. ● పాఠ్యంలోని అన్‌సీన్ పద్యాలు, గద్యాలను (ప్రోజ్), క్లోజ్ టెస్ట్, ఎడిటింగ్ వంటి వాటిపై ప్రశ్నలు అడుగుతారు. అన్‌సీన్ పద్యం, ప్రోజ్‌లను క్షుణ్నంగా అర్థం చేసుకుంటే జవాబులు రాయవచ్చు. ఇందుకోసం కొన్ని అన్‌సీన్ పద్యాలు, ప్రోజ్‌లను అంతర్జాలంలో సేకరించి చదువుకోవాలి. ● ఎడిటింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు పాఠ్య పుస్తకం నుంచే ఇస్తారు. కాబట్టి పుస్తకంలోని అన్ని పాఠాలను క్షుణ్నంగా చదివి అవగాహన పెంచుకోవాలి. ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్, టెన్సెస్, లింకర్స్, పర్యాయపదాలు, వ్యతిరేక పదాలు, అర్థాలపై ధ్యాస నిలపాలి. ● విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్ల భాషలో రాయడం, చదివి అర్థం చేసుకునే నైపుణ్యాలను పెంచుకోవాలి. ప్రశ్నలను చదివి అర్థం చేసుకునే సామర్థ్యం కలిగి ఉండాలి.

సాంఘికశాస్త్రంలో సమకాలీన అంశాలపై ప్రశ్నలు


ఎ.కుమారస్వామి, రిసోర్స్ పర్సన్, కరీంనగర్

సాంఘిక శాస్త్రంలోని 21 అధ్యాయాలను విద్యార్థులు ఇప్పటి నుంచే అవగాహన, ప్రణాళికతో చదివితే ఉత్తమ గ్రేడ్లు సాధించవచ్చు. చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలి.

● పాఠ్యాంశంలో చర్చించిన విషయాల ఆధారంగా ప్రస్తుత సమకాలీన అంశాలపై ప్రశ్నలు వస్తాయి. అందుకని లింగ వివక్ష, బాలికల విద్య, పర్యావరణం, భూగర్భ జలాలు, వలసలు, పట్టణీకరణ, సేంద్రియ ఎరువులు, భూగోళం వేడెక్కడం, ప్రపంచ శాంతి, ఓటు ప్రాధాన్యం, ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియ వంటి అంశాలపై పట్టు సాధించాలి.

● భారతదేశ చిత్రపటంలో రాష్ట్రాలు- రాజధానులు, భూ స్వరూపాలు, నదులు.. ప్రపంచ పటంలో ప్రముఖ ప్రదేశాలు, ఆయా దేశాలు, వాటి రాజధానులను గుర్తించేలా సాధన చేయాలి.

● తెలంగాణ రాష్ట్ర చిత్రపటం గీయడం సాధన చేయాలి.

● సమాచార నైపుణ్యం కింద ప్రశ్నలను పుస్తకంలోని 2, 3, 6, 8, 10, 12, 15, 19, 21 అధ్యాయాల్లో గ్రాఫులు, పట్టికల విశ్లేషణతో అధ్యయనం చేయాలి. దత్తాంశ విశ్లేషణ, సూచనలు ఆధారంగా సమాధానాలు రాయడం నేర్చుకోవాలి.

● ప్రణాళికతో విద్యా ప్రమాణాల ఆధారంగా వివిధ ప్రశ్నలకు సమాధానాలు రాసేప్పుడు సూచనలు పాటిస్తూ రాయడాన్ని అలవాటు చేసుకోవాలి. ఎస్‌సీఈఆర్టీ సాంఘికశాస్త్ర అభ్యాసన దీపికలను అధ్యయనం చేయడం ద్వారా ఎక్కువ మార్కులు సాధించవచ్చు.

విద్యుత్తు నియంత్రిక వద్ద మంటలు

సిరిసిల్ల గ్రామీణం: సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలో విద్యుత్తు నియంత్రిక వద్ద మంటలు ఎగిసి పడ్డాయి. నియంత్రిక నుంచి నిప్పురవ్వలు పడడంతో గడ్డిపై ఉన్న చెత్తాచెదారం అంటుకొని మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సెస్ అధికారులు చేరుకొని సమస్యను పరిష్కరించారు.



ఉపాధ్యాయులను నియమించాలని నిరసన

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం అడవిపదిర పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు శనివారం నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

శివార్చనా.. తుదిరూపు వచ్చేనా?



న్యూస్‌టుడే, వేములవాడ

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి సన్నిధిలో ఏటా జరిగే మహా శివరాత్రి సందర్భంగా శివార్చన పేర భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా తాత్కాలిక వేదికకు రూ.లక్షల నిధులు ఖర్చు చేయాల్సి వస్తుండటంతో శాశ్వత వేదిక నిర్మించాలనే ఉద్దేశంతో ఆలయ అధికారులు పార్కింగ్ స్థలంలో శివార్చన వేదికకు ప్రతిపాదనలు చేశారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) నిధులు రూ.90 లక్షలను వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టారు కానీ.. ఏనాడు పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు జరిగిన దాఖలాలు లేవు. మొదట్లో బేస్‌మెంట్ స్థాయిలో పనులు నిలిచిపోయాయి. కొంతకాలానికి పనులు మళ్లీ మొదలుపెట్టిన గుత్తేదారు.. పిల్లర్లు, వెనుక గదుల పిల్లర్లు, మెట్లు తదితర పనులు పూర్తి చేసి వదిలేశారు. గత మహా శివరాత్రి సందర్భంగా అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న శివార్చన వేదికపైనే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రెండేళ్లు కావొస్తున్నా శివార్చన వేదిక పూర్తి కాకపోవడం అధికారులు, గుత్తేదారు నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని భక్తుల్లో నిరసన వ్యక్తం అవుతోంది.

రెండు ప్రధాన వేడుకలు ఇక్కడే..

రాజన్న ఆలయంలో ఏటా వైభవంగా నిర్వహించే శివ కల్యాణం, శ్రీ రామకల్యాణం వేడుకలను ఆలయ ఈవో కార్యాలయం వద్ద వైభవంగా ఆలయ అధికారులు నిర్వహిస్తుంటారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు వేదిక ప్రాంతంలో స్థలం సరిపోక వేడుకలను తిలకించలేక నిరాశతో తిరుగు ప్రయాణం అవుతున్నారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా శివార్చన వేదిక వద్దనే శివ కల్యాణం, శ్రీ రామకల్యాణం వేడుకలను జరిపించేందుకు ఆలయ అధికారులు నిర్ణయించారు. శివార్చన వేదికలో స్వల్ప మార్పులను ఆలయ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. గతంలో శివార్చన వేదిక వెనుక భాగంలో ప్లాన్‌లో ఉన్న వాటికి బదులు అవసరమైన గదులను సిద్ధం చేసేందుకు శృంగేరి పీఠం పండితుల అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు.


పార్కింగ్ స్థలంలో అసంపూర్తిగా శివార్చన వేదిక

వేదిక నిర్మాణం ఇలా..

శివార్చన వేదికను కళాత్మకంగా సుందరంగా తీర్చి దిద్దాలని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం సిమెంట్ ఫ్లోరింగ్‌తో.. వెనక భాగంలో కైలాశ పర్వతం ఆకారంలో నిర్మాణం.. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా డ్రెస్సింగ్ గదుల నిర్మాణ పనులు చేపట్టారు. ఇంకా ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. దీనిపై ఆలయ డీఈఈ రఘునందన్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. శివ కల్యాణం, శ్రీ రామకల్యాణం వేడుకలను శివార్చన వేదిక వద్ద నిర్వహించేలా శివార్చన వేదిక నిర్మాణ పనుల్లో స్వల్ప మార్పులు చేశామని.. పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వంతెన భూసేకరణకు రూ.6.96 కోట్లు మంజూరు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ మూలవాగుపై హైలెవల్ వంతెన భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.6.96 కోట్ల నిధులను మంజూరు చేసి జిల్లా కలెక్టర్ పీడీ ఖాతాలో జమ చేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2015లో ప్రారంభమైన వంతెన నిర్మాణం పనుల భూసేకరణకు గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచి పోయాయని తెలిపారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో భూసేకరణకు నిధులు కేటాయించిందని తెలిపారు. నిలిచిపోయిన హైలెవల్ వంతెన నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు విప్ పేర్కొన్నారు.

వరదవెల్లికి బోటు వచ్చేసిందోచ్


బోటులో గుట్ట వద్దకు వెళ్తున్న భక్తులు

బోయినపల్లి మండలం వరదవెల్లి వద్ద మధ్యమానేరు జలాశయం బ్యాక్‌వాటర్ వద్దకు శనివారం బోటు చేరింది. దత్తాత్రేయ స్వామి గుట్టపైకి వెళ్లేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బోటు నిర్మాణం కోసం రూ.10.60 లక్షల నిధులు కేటాయించడంతో హైదరాబాద్‌లో తయారు చేయించారు. జలాశయంలో ట్రయల్ రన్ నిర్వహించారు. అర్చకుడు, ఆలయ భక్త బృందం, పలువురు బోటులో గుట్టపైకి వెళ్లి దత్తాత్రేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. త్వరలోనే కేంద్ర మంత్రి బోటును ప్రారంభిస్తారని తెలిపారు. దీంతో భక్తుల ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఏఈ విష్ణువర్ధన్, గ్రామస్థులు ఉన్నారు. **- న్యూస్‌టుడే, బోయినపల్లి**

రుణం చెల్లించాలని వేధింపులకు పాల్పడితే చర్యలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు విరుద్ధంగా జిల్లాలో మైక్రోఫైనాన్స్ లోన్ రికవరీలో వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్‌కుమార్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మైక్రో ఫైనాన్స్ కంపెనీ వారు, వడ్డీ వ్యాపారులు, లోన్‌యాప్ సంబంధిత వర్గాలు కిస్తీల చెల్లింపులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాల్సి ఉంటుందని తెలిపారు. ఎవరైనా అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడటం సరైన నిర్ణయం కాదని.. కుటుంబం ఏమైపోతుందో అని ఆలోచించాలని సూచించారు.

భూమి అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్ అరెస్ట్

చందుర్తి, న్యూస్‌టుడే: ధరణి పోర్టల్‌లో తప్పుడు దస్త్రాలతో రైతు భూమిని ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌ను అరెస్ట్ చేసిన సంఘటన రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలంలో చోటుచేసుకుంది. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన సలేంద్ర మల్లేశంకు సర్వే నంబర్లు 104, 105/అ, 105అ/అ, 105ఉ/అ, 105/ఊ నందు దాదాపు 1.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని సలేంద్ర వేణు తన పేరుతోపాటు తల్లి లక్ష్మి పేరుపై తహసీల్దార్ దర్పల్లి నరేశ్ సహాయంతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని.. నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ద్వారా 25.07.2024న చందుర్తి గ్రామీణ బ్యాంక్‌లో రుణం కూడా తీసుకున్నాడని మల్లేశం ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేపట్టిన అధికారులు.. ధరణి పోర్టల్ నుంచి బ్యాక్ అండ్ డాటాను పరిశీలించారు. తహసీల్దార్ నరేశ్ చందుర్తిలో విధులు నిర్వహించిన సమయంలో సలేంద్ర వేణు, మరో అయిదుగురి ప్రోద్బలంతో ధరణి పోర్టల్‌లో తప్పుడు డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసి పట్టా మార్పిడి చేశారని గుర్తించారు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో తహసీల్దార్ నరేశ్‌ను అరెస్ట్ చేసి వేములవాడ కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ వెల్లడించారు. తహసీల్దార్ నరేశ్ బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా చందుర్తి ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని సీఐ తెలిపారు.


నరేశ్

అథ్లెటిక్స్‌లో ఆణిముత్యాలు

న్యూస్‌టుడే, కరీంనగర్ క్రీడా విభాగం

పరుగు పందెం.. నడక పోటీలు.. మారథాన్‌లు.. ట్రయాథ్లాన్.. స్టీపుల్ ఛేజ్.. పోటీలు ఏవైనా జిల్లా క్రీడాకారులు ప్రత్యర్థులను దాటి విజేతలుగా నిలిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వన్నె తెస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్నారు. గత సెప్టెంబరు 19, 20లలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో.. అక్టోబరు 7, 8లలో హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి ఛాంపియన్లుగా నిలిచారు. వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం



కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రాజయ్య-లక్ష్మిల కుమారుడు వినయ్ స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. లక్ష్మి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికురాలు. క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యంగా 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్, 1500, 5000 మీటర్ల పరుగు సాధన చేస్తున్నాడు.

■ 2023లో ఖమ్మంలో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్టీపుల్ ఛేజ్‌లో బంగారు పతకం, 5000 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించాడు. అదే ఏడాది సెప్టెంబరులో వరంగల్‌లో జరిగిన సౌత్‌జోన్ జాతీయ స్థాయి పరుగు పోటీల్లో 4వ స్థానంలో నిలిచాడు.

■ డిసెంబరులో కామారెడ్డిలో జరిగిన క్రాస్ కంట్రీ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ 8 కి.మీ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

■ 1500 మీటర్ల పరుగు పోటీలో వెండి పతకం గెలుచుకున్నాడు. ఆగస్టులో కరీంనగర్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో స్టీపుల్ ఛేజ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. 5000 మీటర్ల పోటీలో వెండి పతకం నెగ్గాడు.

దేశానికి ప్రాతినిధ్యం వహించాలని..



ఎడ్ల విష్ణువర్ధన్

కరీంనగర్ జిల్లాకు చెందిన ఎడ్ల శేఖర్-లావణ్య దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దేశం తరపున ఆడాలనే లక్ష్యంతో 10,000 మీటర్ల రేస్ వాక్ సాధన చేస్తున్నాడు.

■ ఈనెల 8 నుంచి 10 వరకు అండర్-20 ఏషియన్ సెలక్షన్స్ ట్రయల్స్, జాతీయ జూనియర్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటాడు.

■ 2023 సెప్టెంబరులో వరంగల్‌లో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచాడు. నవంబరులో కోయంబత్తూరులో జరిగిన జూనియర్ నేషనల్స్ ఛాంపియన్‌షిప్‌లో అయిదో స్థానంలో నిలిచాడు.

■ 2024 జనవరిలో చెన్నైలో జరిగిన ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో.. చండీగఢ్‌లో ఓపెన్ నేషనల్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. 2024 మార్చి లఖ్‌నవూలో జరిగిన జూనియర్ జాతీయ అండర్-20 అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటాడు.

ఒలింపిక్స్‌లో ఆడటం ధ్యేయం



జి. నక్షత్ర

సిద్దిపేట జిల్లా శనిగరానికి చెందిన రామకృష్ణ-శ్రీనిధి దంపతులు కరీంనగర్ భగత్‌నగర్‌లో ఉంటున్నారు. వీరి కూతురు జి. నక్షత్ర రెండేళ్ల నుంచి 'ఈనాడు-లక్ష్య' అకాడమీలో పరుగు పందెంలో శిక్షణ పొందుతోంది. కోచ్ తిరుపతి శిక్షణలో ఎన్నో పతకాలు సాధించింది.

■ ఈనెల 17 నుంచి 19 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం సాధించింది.

■ 2024 అక్టోబరు 7, 8లలో హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ట్రయాథ్లాన్ పోటీల్లో జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలిచింది. 2024 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

■ 2023 అక్టోబరు 16న హనుమకొండలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ట్రయాథ్లాన్ పోటీల్లో కాంస్య పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించింది. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో 10 బంగారు పతకాలు, 8 రజత పతకాలు.. జిల్లా స్థాయిలో సుమారు 300 వరకు బంగారు, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టింది.

■ ఒలింపిక్స్‌లో దేశం తరపున ఆడటం తన లక్ష్యమని పేర్కొంది.


పోరాటాల గడ్డపై సరస్వతీ పుత్రులు

ఉపకులపతులుగా సిరిసిల్ల విద్యావేత్తలు

ఈనాడు, సిరిసిల్ల

సిరిసిల్ల ప్రాంతం పోరాట యోధులనే కాదు.. సాహితీ దిగ్గజాలను.. విద్యావేత్తలను అందించింది.. ఈ ప్రాంతానికి చెందిన పలువురు విశ్వవిద్యాలయాలకు కులపతులుగా, ఉప కులపతులుగా పని చేసి విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టారు.. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన జీఎన్. శ్రీనివాస్ తాజాగా పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన నేపథ్యంలో ఈ ప్రాంతానికి చెందిన విద్యావేత్తలపై కథనం.

■ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి.నారాయణరెడ్డి వేములవాడ మండలం హన్మాజిపేటలో జులై 29, 1931లో జన్మించారు. తన ప్రాథమిక విద్యను వీధి బడిలో ప్రారంభించారు. తెలుగులో పీజీ చేసిన ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. కళాశాల అధ్యాపకుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన ఓయూ, తెలుగు విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా పని చేశారు. కవి, గేయ రచయిత, సాహితీ వేత్తగా తనదైన ముద్ర వేసిన ఆయన విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీగా 1985-87 వరకు సేవలందించారు. 1989లో తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులై రెండేళ్లపాటు ఆ హోదాలో ఉన్నారు. 2017లో ఆయన కన్నుమూశారు.




■ దూరవిద్య పితామహుడు జి.రాంరెడ్డి 1929లో వేములవాడ మండలం మల్లారంలో జన్మించారు. రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేసిన ఆచార్యులుగా పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు దూరవిద్యను తీసుకురావాలని అనేక దేశాల్లోని విద్యా వ్యవస్థలపై పరిశోధనలు చేశారు. ఆయన కృషి ఫలితంగానే 1982లో మొదటిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. 1985లో ప్రారంభించిన ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి తొలి వీసీగా అయిదేళ్లపాటు పని చేశారు. దూరవిద్య కోసం ఈయన చేసిన కృషికి గాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూరవిద్య విభాగానికి రాంరెడ్డి పేరు పెట్టారు. 1991లో యూజీసీ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 1995లో లండన్‌లో మృతి చెందారు.

■ ఆర్థికవేత్త చెన్నమనేని హనుమంతరావు కోనరావుపేట మండలం నాగారంలో 1929లో జన్మించారు. దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి 1961లో ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. కేంద్ర ప్రణాళిక విభాగంలో పని చేసిన ఈయన 20 సూత్రాల సలహా కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. వ్యవసాయ అర్థశాస్త్రం, పేదరికం, ఆర్థిక సంస్కరణలు, అభివృద్ధి అంశాలపై వందకుపైగా పరిశోధన పత్రాలు, పుస్తకాలు రచించారు. 2012 నుంచి 2014 వరకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కులపతిగా పని చేశారు.

■ జిల్లాలో హన్మాజీపేట గ్రామం పేరు వినగానే డా.సి.నారాయణరెడ్డి గుర్తుకు వస్తారు. విద్యావేత్త సంకశాల మల్లేశందీ అదే గ్రామం. ఒక సాధారణ వ్యవసాయకూలీ కుటుంబం నుంచి విశ్వవిద్యాలయం వీసీ స్థాయికి ఆయన ఎదిగారు. గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన సిరిసిల్ల ఎస్సీ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. 1990లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తత్వశాస్త్రం పూర్తి చేసిన ఆయన అక్కడే ఎంఫిల్ కూడా చేశారు. జర్మనీలో పీహెచ్‌డీ చేసి పలు కళాశాలల్లో తత్వశాస్త్ర ఆచార్యుడిగా పని చేశారు. మే 24, 2021 నుంచి మే 21, 2024 వరకు కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం వీసీగా వ్యవహరించారు.

■ తాజాగా పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన జీఎన్.శ్రీనివాస్ గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందినవారు. ఈయన పదో తరగతి వరకు గంభీరావుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. కామారెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి 1995లో జేఎన్‌టీయూ నుంచి ఈఈఈలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. తాత్కాలిక అధ్యాపకుడిగా పని చేస్తూనే 1997లో ఎంటెక్ పూర్తిచేశారు. 2003లో జేఎన్‌టీయూలో అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2022లో కొంత కాలం సిరిసిల్ల జేఎన్‌టీయూ ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆచార్యులుగా, ప్రధానాచార్యులుగా, జేఎన్‌టీయూ పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా అంచెలంచెలుగా ఎదుగుతూ వీసీ స్థాయికి చేరుకున్నారు. - **న్యూస్‌టుడే, గంభీరావుపేట**



నిటారుగా బండ.. ఆధారం లేకుండా!

సుల్తానాబాద్ మండలం కదంబాపూర్, తొగర్రాయి గ్రామాల మధ్య ఎత్తయిన గుట్టలున్నాయి. అందులో ఒకటైన పాండవుల గుట్టపై ఓ బండరాయి ఎలాంటి ఆధారం లేకుండా ఇలా నిలబడి ఉండటం చూపరులను ఆకట్టుకుంటోంది. - ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, సుల్తానాబాద్

అపోహ వీడండి... చలామణి పెంచండి

రూ.10 నాణెం చెల్లుబాటుపై ప్రచారం

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

కొంతకాలంగా రూ.10 నాణెం చెల్లుబాటులో లేదనే అపోహలు తీవ్రమయ్యాయి. బడా వ్యాపారులతో పాటు యాచకులు సైతం నాణెం తీసుకునేందుకు నిరాకరించే పరిస్థితులు నెలకొన్నాయి. చిరిగిన నోటు తీసుకుంటున్నారు కాని నాణేం మాత్రం వద్దంటున్నారు. కొందరికి చెల్లుబాటులో ఉందని తెలిసినా.. నిరాకరిస్తున్న సంఘటనలున్నాయి. దీంతో మార్కెట్‌లో చిల్లర కొరత తీవ్రమవుతుంది. ఈ క్రమంలో ఈ నాణెం చెల్లుబాటులో ఉందని.. దీనిపై అపోహలు, దుష్ప్రచారాలు వీడి చలామణిని పెంచాలంటూ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా విస్తృత ప్రచారానికి పూనుకుంది.

బ్యాంకులో పంపిణీ..: ఇప్పటికే ఆర్‌బీఐ ముద్రించిన పోస్టర్లను నగరంలోని పలు వ్యాపార సంస్థల ముందు అంటించడంతో నాణెం వినియోగంపై అవగాహన పెంచేలా చర్యలు తీసుకున్నారు. తాజాగా యూనియన్ బ్యాంకులోని వివిధ శాఖల్లో ఈ నాణేల పంపిణీ తప్పనిసరి చేశారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని యూనియన్ బ్యాంకు శాఖలో ఇటీవల ఒక్కరోజే 50వేల రూ.10 నాణేలను వివిధ వ్యాపార, వాణిజ్య వర్గాలకు పంపిణీ చేశారు. ఈ నాణాన్ని 2005లో ప్రవేశపెట్టగా. . అప్పటినుంచి 2019 వరకు 14 సార్లు ఆర్‌బీఐ ముద్రించి మార్కెట్‌లోకి విడుదల చేసింది.



ఖాతాదారునికి రూ.10 నాణేలను పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

నాణేలకు చట్టబద్ధత: రూ.10 నాణానికి చట్టబద్ధత ఉంది. నాణేం చలామణిలో లేదనేది కేవలం అపోహ మాత్రమే. దీనిపై ఇప్పటికే ఆర్‌బీఐ పలు మార్లు స్పష్టం చేసింది. ఇప్పటికైనా వివిధ వర్గాల వారు అపోహలు వీడి.. చిల్లర కొరత తీర్చుకోవాలి.

- హిమాన్షు బారిక్, మేనేజర్, యూనియన్ బ్యాంకు, గోదావరిఖని (లక్ష్మీనగర్)

నేడు ఎల్‌ఎండీ గేట్ల ఎత్తివేత

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: మధ్యమానేరు జలాశయం నుంచి ఎల్‌ఎండీకి అధికంగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆదివారం ఉదయం 7 గంటలకు ఎల్‌ఎండీ గేట్లు ఎత్తనున్నట్లు నీటి పారుదల శాఖ ఈఈ పి.నాగభూషణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యమానేరు జలాశయం నుంచి సుమారు 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. గేట్లను ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని మానేరు నదిలోకి వదలనున్నారు. నదీ పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, రైతులు వెళ్లవద్దని కోరారు.

బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నుంచి ఎల్‌ఎండీకి శుక్రవారం నీటిని విడుదల చేశారు. జలాశయం రెండు గేట్ల నుంచి 4,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.86 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న భాజపా నాయకులు

సభ్యత్వ నమోదు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేటలో భాజపా సభ్యత్వ నమోదును శనివారం నిర్వహించారు. ఎస్టీ మోర్చా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలోతు సాయికుమార్‌నాయక్, నాయకులు గణేశ్ నాయక్, లస్కర్‌నాయక్, రాజునాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో నియంతృత్వ ప్రభుత్వం'

వేములవాడ, ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నియంతృత్వ ప్రభుత్వం నడుస్తోందని భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా వెళ్లిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇల్లంతకుంటలో భాజపా యువ మోర్చా అధ్యక్షుడు వజ్జపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీనివాస్, హరీశ్, శ్రీనివాస్, ప్రసాద్‌రెడ్డి, మల్లేశం, ముత్తక్క పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మంగళ్లపల్లి గ్రామస్థులు

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మంగళ్లపల్లికి తారు రోడ్డు నిర్మాణానికి పంచాయతీ రాజ్ శాఖ నిధులు రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు.

రైతు కుటుంబానికి అండగా ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: బండలింగంపల్లిలో ఇటీవల పిడుగుపాటుకు గురై రైతు నర్సారెడ్డి మృతిచెందారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం, నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. రైతు మృతిపై కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డి కలెక్టర్‌తో మాట్లాడారని.. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించి.. తక్షణ ఆర్థికసాయం కింద రూ.లక్ష చెక్కును పంపించగా డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ మృతుడి కుటుంబానికి అందించారని తెలిపారు. మిగతా రూ.5 లక్షల సాయం కూడా ప్రభుత్వం త్వరలో అందించడంతోపాటు రైతు బీమా పథకాన్ని వర్తింపజేస్తుందని అన్నారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, నారాయణరెడ్డి, చిన్నలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సిరిసిల్ల పురపాలిక ఛైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. సిరిసిల్లలో శనివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల ముగింపు వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, దేవతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ఛైర్‌పర్సన్ కళ

మంజూరు ప్రక్రియలో నిధులు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి మంజూరైన రూ.1.80 కోట్ల నిధులు వెనక్కి మళ్లిపోలేదని.. దస్త్రాల్లో మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని ఆలయ పునర్ నిర్మాణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్లిన ప్రతినిధులు అక్కడ టీటీడీ అధికారులను శనివారం కలిశారు. నిధులు వెనక్కి మళ్లిపోయాయని గ్రామస్థులు భావిస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో సమాచారం తెలుసుకున్నారు. ప్రస్తుతం దస్త్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించాల్సి ఉందని తెలుసుకొని.. త్వరగా నిధులు మంజూరు చేయాలని టీటీడీ ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. కమిటీ అధ్యక్షుడు నంది కిషన్, ప్రతినిధులు సనుగుల ఈశ్వర్, చందుపట్ల లక్ష్మారెడ్డి, యమగొండ కిష్టారెడ్డి, మానుక రాజుయాదవ్ ఉన్నారు.

రెండో రోజు కొనసాగిన దీక్ష



సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లా తాజా మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం రెండో రోజు కొనసాగాయి. చందుర్తి, కోనరావుపేట మండలాల మాజీ సర్పంచులు దీక్షలో పాల్గొనగా పలువురు నాయకులు మద్దతు తెలిపారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు అంజయ్య, గణప శివజ్యోతి, వేణుగోపాల్‌రావు, పడిగల రవీందర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేర వార్తలు

వెంకటాపూర్‌లో చోరీ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మారాటి లచ్చవ్వ ఈ నెల 17న సిరిసిల్లలోని తన కుమార్తె వద్దకు వెళ్లింది. శుక్రవారం రాత్రి తిరిగివచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని ఒక్క గ్రాము బంగారు ఉంగరం, రెండు తులాల వెండి మొలతాడు, రెండు తులాల వెండి బ్రాస్లెట్ కనిపించలేదు. వాటి విలువ సుమారు రూ.9500 వరకు ఉంటుందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు

బోయినపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో యువకుడికి గాయాలైన ఘటన కొదురుపాక నాలుగు వరుసల వంతెనపై శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ మండలం గుర్రంవాణిపల్లికి చెందిన సంపత్ ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపు వెళ్తున్నారు. నాలుగు వరుసల వంతెనపైకి చేరుకోగానే కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. వాహనదారులు గమనించి 108లో చికిత్స కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి





సిరిసిల్లలోని ఇంగ్లిష్ యూనియన్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులు ఎం.లహరి, పి.సాయిచరణ్, అల్వియా మెహదిన్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్, సమన్వయకర్త జనపాల శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

మానసిక అనారోగ్యం ప్రమాదకరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: శారీరక అనారోగ్యం కన్నా.. మానసిక అనారోగ్యం ప్రమాదకరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు ఎన్.ప్రేమలత అన్నారు. శనివారం జిల్లా కోర్టులో వరల్డ్ మెంటల్ హెల్త్ డేను పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఉద్యోగులకు మానసిక ఒత్తిడిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానసికంగా ఆరోగ్యంగా ఉంటే ఎంతటి సమస్యనైనా ఎదురించొచ్చని.. మంచి జీవనాన్ని ఆచరించి పది మందికి ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. నిత్య వ్యాయామం వల్ల శారీరక దృఢత్వంతోపాటు, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. సామాన్యులకంటే ఉద్యోగులు అధికంగా మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని.. కోర్టు ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్, జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, లోక్ అదాలత్ సభ్యుడు భాస్కర్, మానసిక వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్

మార్షల్ ఆర్ట్స్‌తో రక్షణ

సిరిసిల్ల (విద్యానగర్): మార్షల్ ఆర్ట్స్‌తో బాలికలకు మనోరక్షణ అని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం సిరిసిల్లలోని వెంకంపేట ఫంక్షన్‌హాల్లో శనివారం నిర్వహించారు. జడ్జి రాధిక జైస్వాల్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందిన బాలికలకు ధ్రువపత్రాలను అందించి మాట్లాడారు. ఉచితంగా కర్రసాము శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ అంజయ్య, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు కసుకుర్తి పున్నంచందర్, శిక్షకుడు వొద్దెల శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లాఠీఛార్జి అమానుషం

సిరిసిల్ల గ్రామీణం: హైదరాబాద్‌లో నిరుద్యోగ అభ్యర్థులపై పోలీసుల లాఠీఛార్జిని ఖండిస్తున్నామని భారాసవీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శనివారం సిరిసిల్లలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఖరి మార్చుకొని అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. శ్రీనివాస్, వెంకటేశ్, సాయి, అరవింద్, అనిల్ గౌడ్, నవీన్, అభి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో జనం విలవిల

లోపించిన పారిశుద్ధ్యం.. పట్టించుకోని యంత్రాంగం

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

గ్రామాల్లో జనం జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. వైద్యం కోసం ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఖరీదైన వైద్యానికి పేదలు, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతోంది. పల్లెల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తడం వల్లే జ్వరాలు ప్రబలుతున్నాయి. పారిశుద్ధ్య చర్యలపై అధికార గణం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తాగునీటి క్లోరినేషన్, మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు లార్వా నిరోధించే మందుల పిచికారీ, ఫాగింగ్ నిర్వహణ తదితర పనులను గాలికొదిలేయడం ప్రజలకు శాపంగా పరిణమిస్తోంది.



రాచర్ల గొల్లపల్లిలో ఇళ్ల మధ్యలోనే మురుగుకూపం



వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చిన బాధితులు

ఎల్లారెడ్డిపేటలో తీవ్రం

ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్యకేంద్రం పరిధిలో మే మాసం నుంచి అక్టోబరు 18 వరకు 4044 మందికి జ్వరాలు వచ్చాయి. వీరిలో 310 మందిని ఆసుపత్రిలో చేర్చుకొని చికిత్స అందించారు. 8 మందికి డెంగీవ్యాధి సోకడం జ్వరాల తీవ్రతకు అద్దం పడుతోంది. ఇక గ్రామాల్లోని పీఎంపీ, ఆర్‌ఎంపీలు, ప్రైవేట ఆసుపత్రులకు వెళుతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని తెలుస్తోంది. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బాబు సూచించారు.




తిమ్మాపూర్ పరిధిలోని బాకురుపల్లిలో అపరిశుభ్రంగా ట్యాంకు

అసలు సమస్యలివి..

- వీధులు బహిరంగ ప్రదేశాలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి.
- తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి, క్లోరినేషన్ చేసిన తర్వాత నీటిని విడుదల చేయాలనే నిబంధనలను తుంగలో తొక్కుతుండటంతో ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది.
- గ్రామాల్లో మురుగు కాల్వలు పూడికతో నిండిపోవడంతోపాటు రోజులతరబడి శుభ్రపర్చకపోవడంతో చెత్తతో నిండిపోతూ దుర్గంధం వెదజల్లుతున్నాయి. మురుగు నీటిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి.
- దోమలు విజృంభిస్తున్నా ఇంటెన్సివ్ స్ప్రేయింగ్, యాంటీలార్వాల్, ఫాగింగ్ చర్యలు కనిపించడం లేదు.
- గడ్డి, ఇతర పిచ్చిమొక్కలు పెరగడం వల్ల మురుగునీటి కాల్వల్లో నీరు సజావుగా ముందుకు కదలడం లేదు.
- మురుగునీరు పొంగిన ప్రాంతాలు దోమలకు ఆవాస నిలయాలుగా మారుతున్నాయి. ప్రతి ఇంటిలో జ్వరపీడితులు కనిపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కుటుంబం మొత్తంగా ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. తీవ్ర జ్వరాలతోపాటు ప్రజలు ఇన్‌ఫెక్షన్ బారిన పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇలా...

నెల	ఔట్‌పేషెంట్ (ఓపీ)	జ్వరాల కేసులు	ఇన్‌పేషెంట్ రోగులు	డెంగీ కేసులు
మే	3310	196	32	0
జూన్	3304	198	12	0
జులై	3848	304	61	0
ఆగస్టు	3863	816	94	5
సెప్టెంబరు	3019	876	89	3
అక్టోబరు 18 వరకు	1447	326	22	0



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, పోలీస్ అధికారులు

కేసుల పురోగతికి ప్రత్యేక చొరవ చూపాలి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేసి కేసుల్లో శిక్షల శాతం పెంచాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ శేషాద్రినీరెడ్డితో కలిసి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక చొరవతో పెండింగ్ కేసులపై పురోగతి సాధించాలన్నారు. ప్రాసిక్యూషన్‌లో భాగంగా కోర్టు జారీచేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్లను నిందితులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలన్నారు. రౌడీషీటర్స్‌పై ప్రత్యేక నిఘా ఉంచాలని.. సీసీ కెమెరాల ప్రాముఖ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ఉండేది కాంగ్రెస్ పార్టీ

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల పక్షాన ఉంటూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు కో కన్వీనర్ కనిమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ సిరిసిల్లలో ప్రజలకు చేసింది ఏమీలేదని.. కేటీఆర్, హరీశ్‌రావుల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. నాయకులు ఎల్లప్ప, యాదగిరిగౌడ్, నర్సయ్య, అంజన్‌రావు, కిషన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



రుద్రంగి మార్కెట్ యార్డులో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, కోనరావుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రుద్రంగిలో, కోనరావుపేట మండలం రామన్నపేట, ధర్మారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన స్థానిక నాయకులు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని.. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, రైతు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. నిరంతర ఉచిత విద్యుత్తు సరఫరా, ఏకకాలంలో పంట రుణమాఫీ వంటి కార్యక్రమాలతో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనిచేసి ఎంబీ రికార్డు చేసిన సుమారు రూ.40 వేల కోట్ల బిల్లులను గత ప్రభుత్వం విడుదల చేయకుండా జాప్యం చేసిందని మండిపడ్డారు. కొంతమంది వాటిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బకాయి బిల్లులపై కేటీఆర్, హరీశ్‌రావుల ఇళ్ల ఎదుట ధర్నాలు చేయాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం నెలకొనకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

న్యూస్‌టుడే యంత్రాంగం: ఎల్లారెడ్డిపేట, తిమ్మాపూర్, అల్మాస్‌పూర్‌ల పీఏసీఎస్‌ల పరిధిలోని పలు గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం ప్రారంభించారు. తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె, అంకిరెడ్డిపల్లె.. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట.. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామాల్లోనూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మందుల కొరతపై నిరసన

ముస్తాబాద్, న్యూస్‌టుడే: పోత్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరతపై భారాస యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి ఆధ్వర్యంలో పోత్గల్ ఆసుపత్రి ఎదుట శనివారం నిరసన తెలిపారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు మందులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ యువసేనా రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, నాయకులు ఆది శేఖర్, కిట్టు, బాధవేణి, మహేశ్, జహంగీర్, నరేంద్రచారి, బండ గణేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే పార్కింగ్



సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ ఎదుట ఇష్టానుసారంగా రోడ్డుపై నిలిపిన వాహనాలు ఇవి. నిత్యం ఇదే పరిస్థితి ఉంటుండగా అటుగా వెళ్లే వాహనాలకు ఇబ్బందిగా మారుతోంది. సిరిసిల్ల పట్టణం జిల్లా కేంద్రం అయిన తర్వాత జనాభా గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా పాత బస్టాండ్‌లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రజలు, ప్రయాణికులు, దుకాణాల యజమానులు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాత బస్టాండ్ సమీపంలో పార్కింగ్‌కు ప్రత్యామ్నాయ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

మోటారు బిగింపు

కోనరావుపేట: కోనరావుపేట ఆదర్శ పాఠశాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నట్లు దృష్టికి రాగా శనివారం బోరుబావి మోటార్ మంజూరు చేయించటంతోపాటు బిగింపు పనులు పూర్తయ్యే వరకు ప్రిన్సిపల్ శివకుమార్‌ను ఫోనులో వాకబు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటలో తెలంగాణ సాంస్కృతిక కళామండలి సారథి పొత్తూరి రాజు ఆధ్వర్యంలో శనివారం కళా ప్రదర్శన చేశారు. ప్రభుత్వ పథకాల సద్వినియోగం, స్వచ్ఛదనం- పచ్చదనం, కాలానుగుణ వ్యాధుల కట్టడిపై పాట ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు దేవయ్య, శ్రీలత, సంజీవ్, ఝాన్సీ, లావణ్య, శ్రీలత, శిరీష, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఐడీ కార్డుల పంపిణీ

తంగళ్లపల్లి: సారంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్‌గౌడ్ తన సొంత ఖర్చులతో ఐడీ కార్డులను పంపిణీ చేశారు.

విద్యార్థులకు అవగాహన

ముస్తాబాద్: ఆవునూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శనివారం లైంగిక వేధింపులు, తదితరాలపై అవగాహన కల్పించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ బాలల రక్షణ జిల్లా అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆపద సమయంలో హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 100కు డయల్ చేయాలని సూచించారు.

సనాతన ధర్మాన్ని రక్షించాలి

వేములవాడ: రాష్ట్రంలో సనాతన హిందూ ధర్మాన్ని రక్షించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్తు నాయకులు శనివారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీ నాయకులు గడప కిశోర్‌రావు, నాగుల రాములుగౌడ్, శ్రీనివాస్, హరీశ్, వికాస్, రాజేందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ముఖాముఖి

సిరిసిల్ల కలెక్టరేట్: వేములవాడ మైనార్టీ సంక్షేమ కళాశాలలో టీజీటీ ఇంగ్లిష్, జీఎఫ్‌సీ (జనరల్ ఫౌండేషన్ కోర్సు) పోస్టులు ఖాళీ ఉండగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఇటీవల దరఖాస్తులు స్వీకరించారు. మెరిట్ ఆధారంగా ఇంగ్లిష్ ఒక పోస్టుకు ఆరుగురికి, జీఎఫ్‌సీ పోస్టుకు నలుగురికి కలెక్టరేట్‌లో పాలనాధికారి సందీప్‌కుమార్ ఝా సమక్షంలో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ విద్యా సంస్థల ఇన్‌ఛార్జి రాధాబాయి. ఓఎస్‌డీ సర్వర్ మియా, వేములవాడ మైనార్టీ సంక్షేమ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి విరాళం



ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న అలేఖ్య కుటుంబ సభ్యులు

వేములవాడ, న్యూస్‌టుడే: శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం నిత్యాన్నదాన సత్రానికి వేములవాడ పట్టణానికి చెందిన అలేఖ్య కుటుంబ సభ్యులు రూ.56 వేలను విరాళంగా అందజేశారు. అలేఖ్యకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన సందర్భంగా మొదటి నెల వేతనం చెక్కును ఈవో కార్యాలయంలో ఈవోకు కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఆశిష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రైతులను ఆదుకుంటాం

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట): వానాకాలం సీజన్ వరికోతలు ప్రారంభమవగా అకాల వర్షాలతో నష్టపోయే రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఏఎంసీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం అన్నారు. రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ సాధారణ సమావేశాన్ని ఛైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, గణపతి, లక్ష్మారెడ్డి, చిన్నలక్ష్మి, నారాయణరెడ్డి, బాలయ్య, రవీందర్, కొంగరి కిష్టారెడ్డి, సత్యంరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్, శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

వీర్నపల్లి: గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు కవిత, శేఖర్‌లను సత్కరించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బుచ్చగారి రాకేష్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు వెంగళ శ్రీనివాస్, పాఠశాల అభివృద్ధి కమిటీ నాయకుడు గజ్జల ప్రశాంత్, ఉపాధ్యాయులు కులేరి ప్రేమ్‌సాగర్, బలరాం, మంజుల, శ్రీనివాస్, కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినులు పద్మకళ, కరుణ, మానసలు ఇటీవల బదిలీ అయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల (విద్యానగర్): జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగుల సత్యనారాయణగౌడ్‌ను మానేరు రచయితల సంఘం (మారసం) నాయకులు శనివారం సత్కరించారు. మారసం అధ్యక్షుడు ఎలగొండ రవి, జూకంటి జగన్నాథం, బూర దేవానందం, చిటికెన కిరణ్, ఆంకారపు రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కోనరావుపేట: కోనరావుపేట మండల పశువైద్యాధికారిగా ధర్మారం గ్రామానికి చెందిన పొట్లపల్లి సాహితీరావు శనివారం జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందటానికి కృషి చేయనున్నట్లు సాహితీరావు పేర్కొన్నారు.

రుద్రంగి ఏవోగా ప్రియదర్శిని

రుద్రంగి: రుద్రంగి మండల వ్యవసాయ శాఖ ఏవోగా ప్రియదర్శిని శనివారం బాధ్యతలు చేపట్టారు. చందుర్తి ఏవో దుర్గరాజు రుద్రంగి మండలానికి ఇంతవరకు ఇన్‌ఛార్జిగా విధులు నిర్వర్తించారు.